146) ఆహిరి

ప|| కలిదోషములాల కడు నేల మీరేరు | యిలధరు డుండగాను యికనేటిసుద్దులు ||

చ|| జగములేలెడువాడు సర్వాంతరాత్ముడు | జిగి నింక నీకీబుద్ధి చెప్పనోపడా |
నిగిడి పుట్టించేవాడు నిండుక వుండేటివాడు | తెగనికర్మము లెల్ల తిద్దనేల మానును ||

చ|| దనుజుల గొట్టేవాడు ధర్మము నిలిపేవాడు | పనిగొన్న దురితాలు పాపనేరడా |
కొనమొదలైనవాడు గురి దా నైనవాడు | వునికి మనికి సేయ కూరకుండీనా ||

చ|| స్వతంత్రుడైనవాడు స్వామియైనవాడు | గతియై దాసులనెల్ల గావకుండీనా |
యితడే శ్రీవేంకటేశు డిందిరాపతైనవాడు | సతతము మాకు నిట్టే సంపద లొసగడా ||